క్లుప్తంగా

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ స్టేషన్ పరిశీలిస్తున్న తహసీల్దార్

మద్దిపాడు: మండలంలోని ఏడుగుండ్లపాడు పోలింగ్ బూత్‌ను తహసీల్దార్ సుజన్‌కుమార్ ఆదివారం పరిశీలించారు. ఓటర్ల పేరు, అడ్రెస్, కొత్త ఓట్ల నమోదు చనిపోయిన వారి ఓట్లు తీసివేయడం.. ఓట్ల బదిలీ, వంటి అంశాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేకంగా నీటి సంఘాల ఎన్నికలకు సోమవారం గ్రామ సచివాలయాల్లో ఓటర్ల లిస్టు ప్రదర్శించాలని వీఆర్ఓలకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.

రోడ్లపై ఉన్న స్తంభాలు వెనక్కు జరుపుతాం

మార్కాపురం: మార్కాపురం పట్టణంలో ఆక్రమణల తొలగింపు తరువాత రోడ్లపై ఉన్న కరెంటు స్తంభాలను వెనక్కు జరపాలని అందుకు అవసరమైన ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించినట్లు ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తెలిపారు. ఆదివారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ మున్సిపల్, ఎలక్ట్రికల్ అధికారులకు ఈ మేరకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. చిరువ్యాపారులను ఇబ్బంది పెట్టబోమని చెప్పారు. అధికారులతో మాట్లాడి తగు న్యాయం చేస్తానన్నారు. ఆక్రమణల తొలగింపు కొందరికి కష్టమైనా చాలామంది హర్షిస్తున్నారన్నారు. సమావేశంలో మున్సిపల్ మాజీ చైర్మన్ వక్కలగడ్డ మల్లికార్జున్, కౌన్సిలర్ కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

కొమరోలు: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని హసనాపురం గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. హసనాపురం గ్రామానికి చెందిన బోయిళ్ల వెంకటేశ్వర్లు తన పొగాకు పొలంలో పనులు ముగించుకుని జాతీయ రహదారిపైకి రాగా నర్సరావుపేట నుంచి గిద్దలూరుకు వెళ్తున్న ఓ కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్రగాయాలయ్యాయి. క్షతగాత్రుడిని స్థానికులు 108 సహాయంతో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు.

వీధిలైట్లు వెలగక ఇక్కట్లు

కొండపి: నియోజకవర్గ కేంద్రమైన కొండపి ప్రధాన రహదారిలో వీధిలైట్లు వెలగడం లేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దుకాణదారులు రాత్రి 8:30 గంటలకు షాపులు మూసివేయడంతో కొండపిలోని ఎన్టీఆర్ సర్కిల్ నుంచి కామేపల్లి సెంటర్ వరకు రోడ్లు చిమ్మ చీకటిని తలపిస్తున్నాయి. పాదచారులు, వాహనదారులు ప్రయాణిస్తున్నప్పుడు కుక్కలు వారిని వెంబడిస్తున్నాయి. దీంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత కొన్ని నెలలుగా ఈ సమస్య ఉన్న అధికారులు ఇప్పటివరకు స్పందించలేదు.

చెట్లు తొలగించారు.. తీయడం మరిచారు

- రోడ్లపైనే తొలగించిన చెట్ల కొమ్మలు
- నాలుగు రోజులైన పట్టించుకోని నగరపాలక సంస్థ



ధారావారికుంటలో రోడ్డుమీదే ఉన్న కొమ్మలు

ఒంగోలు అర్బన్: రోజురోజుకీ నగరం అస్తవ్యస్తంగా తయారవుతోంది. ఇప్పటికే నగరంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు సరిగా జరగక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్లకు, విద్యుత్ తీగలకు, పైపు లైన్లు, ప్రైవేటు సంస్థల అండర్ గ్రౌండ్ వైరింగ్ వంటి వాటికి మరమ్మతులకు అవసరమైనపుడల్లా ఆ ప్రాంతాల్లోని చెట్లకు ఆయువు తీరినట్లే. పనులకు అడ్డుగా ఉన్నాయంటూ రోడ్ల పక్కన ఉన్న చెట్లను తొలగించడం నగరంలో పరిపాటిగా మారింది. ఈ నేపథ్యంలో నగరంలోని భాగ్యనగర్, ధారావారికుంట వంటి ప్రాంతాల్లో రోడ్ల పక్కన ఉండే చెట్లను తొలగించారు. అయితే తొలగించిన కొమ్మలను రోడ్లపై నుంచి తీయడం మరిచారు నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం అధికారులు. మరో పక్క ఏళ్ల తరబడి పెరిగిన పచ్చని చెట్లను ఏవో కారణాలతో తొలగించడం పట్ల పర్యావరణ ప్రేమికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అయినా నగరపాలక సంస్థ, విద్యుత్ శాఖలకు మాత్రం అవేమి పట్టనట్లు ఏడాది ఒకసారి రోడ్ల పక్కన పెరిగిన చెట్లను తొలగిస్తూనే ఉన్నారు. అయితే ఇప్పుడు మాత్రం తొలగించిన చెట్ల కొమ్మలను రోడ్లపై నుంచి తీయడం లేదు. దీంతో ఎండిపోతున్న చెట్ల కొమ్మల్లోకి పాములు, ఎలుకలు చేరుతూ అక్కడి నివాస గృహాల ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నాయి. చెట్లు తొలగించి నాలుగు రోజులైన పారిశుధ్య విభాగం పట్టించుకోకపోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. చెట్లను కొట్టడంతో కొమ్మలు, ఆకులు సైడు కాలువల్లో పడి మురుగు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. ఇప్పటికైనా నగరపాలక సంస్థ స్పందించి రోడ్లపై కొమ్మలను తీయడంతో పాటు తొలగించిన చెట్ల స్థానంలో కొత్త మొక్కలు నాటి సంరక్షించి పర్యావరణాన్ని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.



భాగ్యనగర్లో రోడ్లపైనే ఉంచిన చెట్లకొమ్మలు

ఎరువుల కొరత.. రైతు కలత

- అధిక ధరలకు డీఏపీ విక్రయాలు
- సొసైటీల్లో నిండుకున్న డీఏపీ ఎరువులు
- చోద్యం చూస్తున్న వ్యవసాయ అధికారులు



సొసైటీ (ఫైల్)

నాగులుప్పలపాడు: ప్రస్తుత వ్యవసాయ సీజన్‌లో ఎరువుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఖరీఫ్‌తో పాటు రబీ సీజన్ కూడా ప్రారంభం అయిన నేపథ్యంలో ఎరువుల కొరత లేకుండా చూడాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎరువుల కొరత వలన అక్కడక్కడా ఉన్న కొద్దిపాటి ఎరువులకు రెక్కలు వచ్చి అధిక ధరలకు అమ్ముకుంటున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఈ ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో రైతు భరోసా కేంద్రాలకు ఎరువులు చేరాయి. అయితే ఇవి కూడా పూర్తి స్థాయిలో చేరలేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా జూన్, జులై నెలల్లో రైతులకు పంపిణీ చేశారు. అయితే ప్రస్తుతం ఎరువులు అవసరం మేరకు లేకపోవడం ప్రైవేటు వ్యాపారుల పైన ఆధారపడాల్సి వచ్చింది. దీంతో గత వారం రోజులుగా నాగులుప్పలపాడు మండల వ్యాప్తంగా ఎరువుల కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నారు. యూరియాపై 50 నుంచి 100 రూపాయలు, డీఏపీపై 100 నుంచి 200 రూపాయలు అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు చెబుతున్నారు. రైతులు ఎరువులు అడిగితే ఇతర పురుగు మందులు, కలుపు మందులు కొనుగోలు చేయాలని వ్యాపారులంటున్నారని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రభుత్వం రతైలు భరోసా కేంద్రాల ద్వారా కాకుండా సహకార సంఘాల ద్వారా పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం ఇటు రైతు భరోసా కేంద్రాలకు గానీ సొసైటీలకు గానీ ఎరువులు చేరలేదు. దీన్ని అదునుగా చేసుకొని వ్యాపారులు అక్రమాలకు పాల్పడుతున్నారు.

అందుబాటులో లేవు



ప్రస్తుతం మాగాణి పంటలు వేశాం. తప్పకుండా డీఏపీ ఎరువు ఉంటేనే పంటకు అనువుగా ఉంటుంది. డీఏపీ ఎరువు అడుగుతుంటే ఎక్కడా అందుబాటులో లేదంటున్నారు. మా పంటకు అంతగా అనువు కానప్పటికీ మిగతా ఎరువులు వేయాల్సి వస్తోంది.

– కుక్కల అంజిరెడ్డి, కనపర్తి

చాలా గడ్డు పరిస్థితి



శనగ పంట వేసేందుకు పొలాల్లో బలాలు పెట్టే సమయం కావడంతో ఎరువుల కోసం చాలా కష్టపడాల్సి వస్తోంది. డీఏపీ కొరత అనేది ఈ సమయంలో చాలా గడ్డు పరిస్థితి. అధికారులు చొరవ తీసుకోవాలి.

– రమణారెడ్డి, మాచవరం

వేడుకగా విశ్వబ్రాహ్మణ కార్తీక వన సమారాధన



కార్తీక వనభోజనాల్లో పాల్గొన్న విశ్వబ్రాహ్మణ కుటుంబాలు

ఒంగోలు మెట్రో: జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంక్షేమ సేవా సంఘ కార్తీక వన సమారాధన మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆదివారం ఒంగోలు దక్షిణ బైపాస్ రోడ్‌లో ఉన్న విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో 30వ కార్తీక వన సమారాధన మహోత్సవం నిర్వహించారు. ఆసంఘ ఉద్యోగస్తులు భారీగా హాజరై కార్తీక వనభోజనాలు స్వీకరించారు. ఉదయం నుంచి వీరబ్రహ్మేంద్రస్వామి ప్రచార పరిషత్ బృందం వారిచే భక్తి గీతాలు, కార్తీక పూజలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన పలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కూచిపూడి నృత్యం, మ్యాజిక్ స్టార్ అవార్డు గ్రహీత బీవీ రామన్ మ్యాజిక్ షో వీక్షకులను కట్టిపడేసింది. ప్రముఖ గుండె వైద్య నిపుణుడు డాక్టర్ కేశవ అన్నపూర్ణ దంపతులకు, అధ్యక్షులు రావూరి లక్ష్మయ్యలకు విశిష్ట సన్మానం చేశారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగస్తులకు 75 సంవత్సరాలు నిండిన ఉద్యోగస్తులకు ఉత్తమ అవార్డు గ్రహీతలకు ప్రత్యేకంగా సన్మానం నిర్వహించారు. కార్యక్రమానికి ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు రావూరి లక్ష్మయ్య అధ్యక్షత వహించారు.కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఎన్ మల్లేశ్వరరావు, కోశాధికారి రంగనాయకులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ యద్దనపూడి శివప్రసాద్, కందుకూరి పూర్ణచంద్ర రావు, కార్యవర్గ సభ్యులు, విశ్వబ్రాహ్మణులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆకట్టుకున్న సుమనస రంజని గానసభ



గానసభలో కచ్చేరి చేస్తున్న విద్వాంసులు



సంగీత కళాకారులను సన్మానిస్తున్న నిర్వాహకులు

ఒంగోలు మెట్రో: కళలకు కాణాచి ఒంగోలు నగరం అని ఒంగోలు పార్లమెంట్ సభ్యుడు మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. ఆదివారం ఒంగోలు పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రం వేదికగా సుమనస రంజని గానసభ నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్య నిపుణురాలు, కర్ణాటక సంగీత విద్వాంసురాలు డాక్టర్ బీ నాగమాధురి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ప్రకాశం జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరు శ్రీనివాసులు అధ్యక్షత వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి అతిథులు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ప్రఖ్యాత సంగీత విద్వాంసుడు సంగీతాచార్య డాక్టర్ వైజర్స్ బాల సుబ్రమణ్యం, ప్రఖ్యాత నాదస్వర విద్వాంసుడు త్రోవగుంట షేక్ కస్మూర్ మస్తాన్ సాహెబ్ హాజరయ్యారు. ఈసందర్భంగా కుమారి ప్రణతి వైజర్స్ గాత్రకచేరి, సంగీత కళానిధి పద్మశ్రీ కుమారి, అవసరాల కన్యాకుమారి వయోలిన్ కచేరి ఆహుతులను సంగీత ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, తాతా ప్రసాద్, శ్రీరామమూర్తి, నళినిప్రియ కూచిపూడి నృత్య నికేతన్ నిర్వాహకురాలు శివకుమారితో పాటు పలువురు సంగీత ప్రియులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



క్వాలిఫయింగ్ మ్యాచ్‌లో పాల్గొన్న క్రీడాకారులు

ఒంగోలు: రాష్ట్రస్థాయి అండర్–11 బ్యాడ్మింటన్ క్వాలిఫయింగ్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఒంగోలు లార్డ్ కృష్ణ బ్యాడ్మింటన్ అకాడమిలో మ్యాచ్‌లు నిర్వహించారు. ఈపోటీలకు బాలుర సింగిల్స్‌లో 83, బాలికల సింగిల్స్‌లో 34, బాలుర డబుల్స్‌లో 31 మంది, బాలికల డబుల్స్ విభాగంలో 12 మంది హాజరయ్యారు. క్వాలిఫయింగ్ మ్యాచ్‌లలో రెట్టించిన ఉత్సాహాన్ని ప్రదర్శించి రాష్ట్రస్థాయి పోటీలకు క్వాలిఫై కావాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణ్ రెడ్డి సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి విజయ్‌కృష్ణ, అద్దంకి మురళీకృష్ణ, రఘుబాబు, దండు శ్రీనివాసరావు, కోడె శ్రీనివాసరావు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు.

అన్నదానం మహాదానం

- షిరిడీ సాయి మందిరంలో అన్నదాన భవన నిర్మాణానికి శంకుస్థాపన



పూజల్లో పాల్గొన్న హరిహరరావు దంపతులు

మార్కాపురం: అన్నదానం మహాదానమని ప్రముఖ అధ్యాత్మికవేత్త, మార్కాపురం పట్టణంలోని షిరిడీ సాయిబాబా మందిర కార్యదర్శి గోపాలుని హరిహరరావు పేర్కొన్నారు. ఆదివారం మందిరం ఆవరణలో దాతల సహకారంతో నిత్యాన్నదాన భవన నిర్మాణానికి అధ్యక్షుడు పేరం సత్యనారాయణ, పలువురు పట్టణ ప్రముఖుల సమక్షంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాబా సూక్తుల్లో ప్రధానమైనది ఆకలిగొన్న వారికి అన్నం పెట్టడమేనని, బాబాను ఆదర్శంగా తీసుకొని మందిరంలో గత 25 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు, అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారం మరువలేనిదన్నారు. గత 14 ఏళ్ల నుంచి నిత్యాన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, శాశ్వత భవనం ఏర్పాటుతో మరిన్ని సేవలు అందించే అవకాశం ఉందన్నారు. అర్చకులు రామకృష్ణాచార్యులు, రవిశర్మల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ సీహెచ్ బాలమురళీకృష్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రామిరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మల్లికార్జున్, జనసేన, బీజేపీ ఇన్‌చార్జిలు ఇమ్మడి కాశీనాథ్, పీవీ కృష్ణారావు, మందిర కోశాధికారి పీవీఎల్ఎన్వీ నాగరాజు, ఉపాధ్యక్షుడు ఆర్‌వీ గోపి, యువసమాజ్ అధ్యక్ష కార్యదర్శులు గోపాలుని కృష్ణమోహన్, కరీంబాషా, చల్లా పవన్‌కుమార్, మేనేజర్ సతీష్ నాయుడుతోపాటు పలువురు పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.

19న ఏఐఎస్ఎఫ్ జిల్లా మహాసభలు

పొదిలి రూరల్: అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ ప్రకాశం జిల్లా 20వ మహా సభలు ఈ నెల 19వ తేదీన పొదిలి పట్టణంలో నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మహా సభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అఖిల భారత విద్యార్థి సమాఖ్య 1936 ఆగస్టు 12న లక్నో నగరంలో ఆవిర్భవించిందన్నారు. అప్పటి నుంచి విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలు చేస్తోందని చెప్పారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని, సమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేయాలని, ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని, సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మహాసభకు ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, మాజీ జాతీయ కార్యదర్శి ఈశ్వరయ్య, నారాయణ పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో జి.స్టాలిన్, సురేంద్ర, సన్నీ, జోషి, అశోక్ పాల్గొన్నారు.

హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

గిద్దలూరు రూరల్: విశ్వ హిందూ పరిషత్(వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో జనవరి 5వ తేదీన విజయవాడలో నిర్వహించనున్న హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్గ ప్రముఖ్ కె.రామకృష్ణ కోరారు. పట్టణంలోని రామకృష్ణ ధ్యాన మందిరంలో ఆదివారం వీహెచ్‌పీ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. దేవాలయాలను పరిరక్షించుకునే పోరాటంలో భాగంగా హైందవ శంఖారావాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నామని, ప్రతి హిందువూ కదలి రావాలని కోరారు. సంస్కృతి సాంప్రదాయలను పరిరక్షించుకోవాలంటే దేవాలయ వ్యవస్థను కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు ఇతర మతాలకు చెందిన ప్రార్థన మందిరాల్లో జోక్యం చేసుకోకుండా కేవలం హిందూ మతానికి చెందిన ఆలయాలపై ఎందుకు పెత్తనం చలాయిస్తోందో ప్రతి హిందువూ ఆలోచించాని కోరారు. అనంతరం బహిరంగ సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ ఖండ కార్యవాహ పంట శివ మల్లారెడ్డి, ప్రచార ప్రముఖ్ మునుగొండ్ల రాజ్‌కుమార్‌యాదవ్, మారుతీప్రసాద్, విశ్వ హిందూ పరిషత్ నాయకులు బూజుమేకల రాజుయాదవ్, సమరత సేవా సంస్థ ప్రతినిధి సూరె కృష్ణారావు, రామకృష్ణ ధ్యాన మందిరం నిర్వాహకులు హనుమంతారెడ్డి, నిర్వాహకులు, బీజేపీ నాయకులు పిడతల రమేష్‌రెడ్డి, అప్పిశెట్టి శంకర్, రామాంజనేయులు, వీహెచ్‌పీ సభ్యులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం స్వాధీనం

పొదిలి రూరల్: కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు గ్రామంలో ఓ బెల్ట్ షాప్‌పై శనివారం రాత్రి మంగళగిరి ఎస్‌టీఎఫ్ స్క్వాడ్ అధికారులు దాడి చేశారు. గ్రామాని చెందిన ఓ వ్యక్తి నిర్వహిస్తున్న బెల్ట్ షాపులో 25 క్వార్టర్ బాటిళ్లు సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

కంభంలో 26 క్వార్టర్లు సీజ్

కంభం: అక్రమంగా మద్యం కలిగి ఉన్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు స్థానిక ఎస్సై బి.నరసింహారావు తెలిపారు. బెల్టు షాపులపై ఆదివారం తనిఖీలు నిర్వహిస్తుండగా బస్టాండ్ సమీపంలో ఓ వ్యక్తి వద్ద 26 మద్యం బాటిల్స్ లభించాయని, నిందితుడిని అదుపులోకి తీసుకొని మద్యం సీజ్ చేసినట్లు చెప్పారు. ఎస్సై మాట్లాడుతూ.. అక్రమంగా మద్యం తరలించినా, బెల్టు షాపులు నిర్వహించినా, రెస్టారెంట్లు, కూల్‌డ్రింక్ షాపుల్లో మద్యం విక్రయించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొదిలిలో ఆటో బోల్తా

పొదిలి రూరల్: స్థానిక విశ్వనాథపురంలోని కాలేజీ రోడ్డులో ప్రయాణికుల ఆటో బోల్తా పడింది. ఈ సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. మతిస్థిమితం లేని వ్యక్తి అడ్డు రావడంతో ప్రమాదవశాత్తు ఆటో బోల్తా పడినట్లు స్థానికులు తెలిపారు. ఆటో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి బోల్తా పడిన ఆటోను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చేశారు. ఆటోలో మిగిలిన వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ప్రజలపై మోదీ భారం



సంతనూతలపాడు జండా ఆవిష్కరిస్తున్న అబ్బూరి వెంకటేశ్వర్లు

సంతనూతలపాడు: ప్రధాని నరేంద్ర మోదీ మూడో సారి అధికారంలో వచ్చిన తరువాత సామాన్య ప్రజలపై విపరీతమైన భారాలు వే స్తూ పెట్టుబడిదారులకు వరాలు కురిపిస్తున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తీవ్ర స్థాయిలో విమర్శించారు. మంగమూరులోని కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో ఆదివారం జరిగిన సీపీఎం ఏడో మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా ప్రారంభోపన్యాసం చేశారు. మోదీకి పార్లమెంట్లో సంపూర్ణ మెజారిటీ లేదని అయినప్పటికీ దేశ సంపదను అంబానీ, అదానీ లాంటి కార్పొరేట్ శక్తులకు ధారాదత్తం చేస్తున్నారని ధ్వజమెత్తారు. దేశ రాజ్యాంగానికి తిలోదాకాలిచ్చి మతతత్వాన్ని ప్రేరేపిస్తూ ప్రజల మధ్య చిచ్చు పెడుతున్నారని విమర్శించారు. వక్ఫ్ బోర్డ్.. క్రిమినల్ చట్టాల్లో సవరణలు చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చినప్పటికీ ప్రజలకు ఒరిగిందేమీ లేదని ఆయన పేర్కొన్నారు. ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మరింత భారం వేశారన్నారు. సనాతన ధర్మం అంటే దళితులను అంటరానివారుగా దూరంగా పెట్టడం, సతీ సహగమనం పేరుతో దురాచారాలను అమలు చేయడమా అని ప్రశ్నించారు. అబ్బూరి వెంకటేశ్వర్లు, నెరుసుల వెంకటేశ్వర్లు, బంకా పద్మ, అధ్యక్ష వర్గంగా వ్యహరించారు. సభలో సంతాప తీర్మానాన్ని కిలారి పెద్దబ్బాయి ప్రవేశపెట్టారు. సభలో పార్టీ జిల్లా కార్యదర్శిసభ్యులు షేక్ మాబు, మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, నాయకులు షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

రోడ్డు ఇలా.. ప్రయాణమెలా?



గనివానిపాడు సమీపంలో రోడ్డు ఇలా..

కొనకనమిట్ల: ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని పలు రహదారులు కోతకు గురై నడవటానికి సైతం ఇబ్బందికరంగా మారాయి. అడుగుకో గుంత, బారెడుకో గతుకు అన్నట్టుంది మండలంలోని వాగుమడుగు నుంచి గనివానిపాడు వెళ్లే రోడ్డు పరిస్థితి. రోడ్డుపై తారు మొత్తం దెబ్బతిని కంకర పైకి తేలడంతోపాటు గోతులు ఏర్పడటంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని ప్రజలతో పాటు వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా రహదారి మధ్యలో చప్టాల వద్ద ఇరువైపులా రోడ్డు కోతకు గురైంది. అలాగే గనివానిపాడులో కొద్దిపాటి వర్షం పడినా గ్రామంలో వర్షం నీరు బయటికి వెళ్లే మార్గం లేక వీధుల్లోనే నిల్వ ఉంటోంది. దీంతో జనం నడవడానికి ఇబ్బందికరంగా ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేయించాలని కోరుతున్నారు.

అల్లూరి పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



కోటసత్యమాంబదేవి అల్లూరి పోలేరమ్మ

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో కొలువై ఉన్న అల్లూరి పోలేరమ్మ ఆలయంలో భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు వెంకటేశ్వర్లు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమార్చన చేశారు. ఆలయ ఆవరణలోని నాగశిలలు, పుట్ట వద్ద భక్తులు పూజలు చేశారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవరెడ్డి, ఆలయ సిబ్బంది శ్రీధర్‌రెడ్డి తదితరులు పర్యవేక్షించారు. అలాగే కళాశాల రోడ్డులో ఉన్న పోలేరమ్మ వారికి భక్తులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. అర్చకులు అమ్మవారిని వేకువజామున ప్రత్యేకంగా అలంకరించి అర్చన, అభిషేకం, పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ఒంగోలు డివిజన్
9010224456 90103 57744
90102 02762
చీమకుర్తి 84639 03727

Office mail : sakshiongads@gmail.com